
సాక్షి
ఒడిశా
శనివారం । 13 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,03,870
బంగారం	4 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
వెండి	15 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

మైత్రీ కంపెనీ అధికారులపై దాడి



రాయగడ జిల్లాలోని కాసీపూర్‌లో ఉన్నటువంటి మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధికారులపై శుక్రవారం దాడి జరిగింది.

- IIలో▸



బాల్య వివాహాలు తగ్గుముఖం

పర్లాకిమిడి జిల్లాలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు.

- IIలో▸

న్యూస్‌రీల్

కిన్నెరలకు ఇళ్లు మంజూరు చేయాలి



కలెక్టర్ స్మృతి రంజన్‌కు మొక్క అందజేస్తున్న ట్రాన్స్‌జెండర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వీటీ సాహు

పర్లాకిమిడి: జిల్లాలో నివసిస్తున్న కిన్నెరలకు రాష్ట్ర ప్రభుత్వం వసుంధర పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ట్రాన్స్‌జెండర్స్ అధ్యక్షురాలు స్వీటీ సాహు కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో కిన్నెరుల సభీ జిల్లాస్థాయి వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. కిన్నెరుల ఉన్నత చదువులకు రూ.2.50 లక్షల ఎడ్యుకేషనల్ రుణం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ.. డిప్లమా, డిగ్రీ చదువుకున్న కిన్నెరులకు నెలసరి రూ.2500లు ప్రభుత్వ స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌జెండర్స్ కార్యదర్శి జాస్మిన్ సింగ్, జిల్లా అధ్యక్షులు మధు బోరాజో తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సన్నాహాలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ ఏడాది వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సమాయత్తమవ్వాలని ఏడీఎం రైతా సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ట్రక్ బోల్తా



లోయలో పడిన కలప ట్రక్కు

బరంపురం: పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి తప్తపాణి ఘాటీ రోడ్డుపై కలప లోడ్‌తో వెళ్తున్న ట్రక్కు 50 అడుగుల లోయలో బోల్తాపడింది. సమాచారం అందుకున్న పట్టపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రక్కులో చిక్కుకున్న డ్రైవర్, క్లీనర్‌ను రక్షించి, దిగపండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతో ఒకరు దారుణ హత్య



పూర్ణ పెంటియ (ఫైల్)

జయపురం: పాత కక్షల కారణంగా బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ పోలీసుస్టేషన్ పరిధి బెనాపూర్ పంచాయతీ దుండిగుడ గ్రామంలో బుధవారం దారుణ హత్య చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పూర్ణ పెంటియ(45)పై అదే గ్రామానికి చెందిన పూర్ణ నాయిక్ అనే వ్యక్తి కత్తితో దాడిచేయడంతో మరణించారు. అనంతరం పూర్ణ నాయిక్ పారిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బిసింగపూర్ పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే హత్యకు పాత కక్షలే కారణంగా గ్రామస్తులు భావిస్తున్నారు. 2022 సంవత్సరం గణేష్ పూజ నిమజ్జన సమయంలో వీరిద్దరికీ గొడవ అయ్యింది. దీంతో అప్పట్లో పూర్ణ పెంటియ బిసింగపూర్ పోలీసుస్టేషన్‌లో పూర్ణ నాయిక్‌పై ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి కోపంతో రగిలిపోతున్న నాయిక్ హత్యకు పాల్పడి ఉంటాడని చెబుతున్నారు.

భువనేశ్వర్‌కు.. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

- జాతీయ స్థాయిలో 34వ ర్యాంకు
- రాష్ట్రంలో పరిశుభ్ర నగరంగా గుర్తింపు



అవార్డు అందుకుంటున్న బీఎంసీ బృందం

భువనేశ్వర్: స్వచ్ఛత నిర్వహణలో రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్ అంచెలంచెలుగా అగ్రస్థానానికి ఎదుగుతోంది. తాజాగా ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్–23 జాబితాలో జాతీయ స్థాయిలో ఈసారి 34వ స్థానంలో నిలిచింది. గతసారి భువనేశ్వర్ 80వ ర్యాంక్‌కు పరిమితమైంది. భువనేశ్వర్‌కు తొలిసారిగా వాటర్ ప్లస్ అవార్డు కూడా లభించడం విశేషం. గతసారి ఈ వర్గంలో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ స్థాయిలో నిలిచింది. రాజధాని నగరం చెత్త రహిత నగరంగా కూడా పురస్కారం గెలుచుకుంది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ఈ అవార్డులను అందుకుంది.

ప్లాస్టిక్ నిషేధంలో ముందంజ

వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, పునర్వినియోగం కార్యాచరణ, పారిశుద్ధ్య కార్మికుల భద్రత ఆధారంగా నగరం ఈ అవార్డులను సొంతం చేసుకోగలిగింది. 2016 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం దేశంలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే నిర్వహిస్తోంది. ఈ ఏడాది 4,477 నగరాలను ఈ సర్వేలో చేర్చారు. రాష్ట్రం నుంచి భువనేశ్వర్ 34వ స్థానంలో, 62వ స్థానంలో పూరీ, 99వ స్థానంలో బాలేశ్వర్, 111వ స్థానంలో బరంపురం, 119వ స్థానంలో రౌర్కెలా, 163వ స్థానంలో సంబలపూర్, 172వ స్థానంలో కటక్, 185వ స్థానంలో బరిపద, 229వ స్థానంలో భద్రక్ చోటుచేసుకున్నాయి.

పరిశుభ్రతలో పురోగతి

గతేడాదితో పోలిస్తే పరిశుభ్రత నిర్వహణలో భువనేశ్వర్ 46 స్థానాలు ఎగబాకి 34వ స్థానంకు నగరం చేరుకుంది. గతేడాది 80 పాయింట్ల వద్ద ఆగింది. ఈ ఎదుగుదల ప్రేరణగా వచ్చే ఏడాది టాప్ 10లో ఉండేలా కృషి చేద్దామని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) మేయర్ సులోచన దాస్ పిలుపునిచ్చారు. భువనేశ్వర్ పట్టణానికి వాటర్ ప్లస్ ఎక్సలెన్స్ అవార్డు సైతం లభించింది. ఈ అవార్డు అందుకున్న ఒడిశాలోని ఏకైక నగరంగా గుర్తింపు పొందింది. అలాగే చెత్త రహిత నగరంగా భువనేశ్వర్ అద్భుతమైన 3 స్టార్ రేటింగ్‌ను పొందింది. పరిశుభ్రమైన, పచ్చని భవిష్యత్తు కోసం నగర వాసుల అంకితభావానికి ఈ అవార్డు ప్రతీకగా నిలుస్తుందని మేయర్ సులోచన దాస్ ఆనందం వ్యక్తం చేశారు.

శరవేగంగా జగన్నాథ్ సాగర్ పనులు



సాగర్ పనులపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం:

చారిత్రాత్మక జగన్నాథ సాగర్ అభివద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అలాగే పంచానన మందిర కూడలి వద్ద నిర్మిస్తున్న లేక్ వ్యూ పార్క్ పనులు జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వెల్లడించారు. స్థానిక మున్సిపల్ సభా గృహంలో సాగర్ అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తున్న హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) సునాబెడ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం నలుగురు హాల్ అధికారుల బృందం జగన్నాథ సాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఖర్చు వివరాల యూసీని (యుటిలైజేషన్ సర్టిఫికెట్)ను అధికారులు వారికి అందజేశారు. సిద్ధార్థ పట్నాయక్ మాట్లాడుతూ లేక్ వ్యూ పార్క్ పనులు చివరి దశకు వచ్చాయని, ఫ్లోరింగ్, ఆటల సామగ్రి ఏర్పాటు పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఓపెన్ గ్యాలరీ, క్యాంటిన్, యోగాభ్యాస స్థలం, కూర్చొనే సౌకర్యం నిర్మాణాలు జరుగుతున్నాయని తెలియజేశారు. హాల్ ఇంతవరకు రూ.80 లక్షలు అందజేసిందని, ఇంకా రూ.20 లక్షలు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే జయపురం మున్సిపాలిటీ సాగర్ అభివద్ధి పనులకు రూ.60 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ అజయ కుమార్ జాని తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం



విద్యార్థిని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న బిజయ్ కుమార్ పట్నాయక్

- కలెక్టర్ బాధ్యత వహించాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిజయ్ కుమార్ పట్నాయక్

రాయగడ: స్థానిక బారిజోల వద్దనున్న జీఏసీఆర్ కళాశాల మైదానంలో బుధవారం జిల్లా యంత్రాంగం నిర్వహించిన సువా–ఓ ఫెస్ట్ కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిజయ్ కుమార్ పట్నాయక్ ఆరోపించారు. ప్రమాదంలో గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దీపాలి నాయక్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించకపోవడంతోనే భోజన సమయంలో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ఘటనకు కలెక్టర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులతో రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి, కంటి తుడుపు చర్యలు తీసుకుని వ్యవహరిస్తున్న తీరు విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు అస్లాం ఖాన్, సీనియర్ నాయకుడు అప్పల స్వామి కడ్రక తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబులు సైతం విద్యార్థినిని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముదులి మాట్లాడుతూ విద్యార్థినికి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు.

'లారీలను అనుమతించాలి'



కలెక్టర్‌ను కలిసిన లారీ యజమానులు

రాయగడ: నిత్యావసర సరుకులతో పాటు ఇంటి నిర్మాణ సామగ్రి తదితర అవసరమైన వస్తువులను రవాణా చేస్తున్న లారీలను పట్టణంలోకి అనుమతించాలని కోరుతూ రాయగడ ట్రక్ యజమానుల సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు ఎల్ల కొండబాబు నేతృత్వంలో లారీ యజమానులు, శ్రామిక సంఘాల ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణ శివారు ప్రాంతాల్లో లారీలను నిలుపుదల చేసి, చిన్న వాహనాల ద్వారా పట్టణంలోని దుకాణాలకు చేరవేయాలంటే అదనంగా భారీ ఖర్చులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాలకు దూరంగా నిలిపిన లారీల్లో ఒకొక్కసారి దొంగతనాల జరుగుతుండడంతో నష్టాన్ని భర్తీ చేసేందుకు నానా అవస్థలు పడుతున్నట్లు వివరించారు. జిల్లా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈవీఎంలపై అవగాహన



అధికారులతో కలెక్టర్ సింగ్

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. దీనిలో భాగంగా కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ ఈవీఎంలపై సంబంధిత శాఖ అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది జిల్లాలోని 11 సమితుల్లో ఓటర్లకు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి సూర్యమణి భోయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే పార్టీకి వెన్నెముక



సమావేశంలో పాల్గొన్న మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: మహిళలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక బాబాసాహెబ్ కల్యాణ మండపంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి మహిళలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు కంచుకోట అయినటువంటి కొరాపుట్‌లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి సమష్టిగా పనిచేయాలన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా తాను అనేక అభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజలకు మేలు జరగాలంటే మరలా కాంగ్రెస్ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పీసీసీ సాధారణ కార్యదర్శి మీనాక్షి బాహిణీపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో మ్యాపింగ్

- సీఎస్ ప్రదీప్ కుమార్ ప్రతిపాదన
- క్యాంపా రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం



క్యాంపా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: అటవీ విస్తరణ మ్యాపింగ్ అధ్యయనం చేయడానికి డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా ప్రతిపాదించారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో అటవీకరణ పరిహార నిధి నిర్వహణ, ప్రణాళిక అథారిటీ (క్యాంపా) రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ విస్తరణ నేపథ్యంలో మొక్కలు నాటిన ఒక సంవత్సరం నుంచి ఏటా నిరవధికంగా అధ్యయనం అనివార్యమని పేర్కొన్నారు. మొక్కల పెంపకం, నిర్వహణ కార్యకలాపాల్లో 10 సంవత్సరాల్లో భూగర్భజలాల పునరుద్ధరణ, నేల (మట్టి) క్షీణత నివారణ కార్యకలాపాల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధి వనరులు సమీకరించే అటవీకరణ అవసరమన్నారు. ఈ మేరకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో ముందుకు సాగాల్సి ఉందన్నారు. ఫారెస్ట్ గార్డుల సమన్వయంతో అడవుల్లో మంటల నుంచి రక్షణ కోసం స్థానిక సంఘాలు, వన సురక్ష సమితులు పాలుపంచుకోవాలని కోరారు. బయోస్పియర్ రిజర్వ్‌లు, అటవీ ప్రాంతాలకు పర్యాటకులను తీసుకువెళ్లే డ్రైవర్లకు కొన్ని రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ శిక్షణ పర్యాటకులు, సందర్శకుల సురక్షిత పర్యటన అనుభూతితో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు.

వార్షిక కార్యచరణ ప్రణాళిక

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) దేబీదత్త బిస్వాల్ 2023–24 సంవత్సరానికి సంబంధించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక (ఏపీఓ) వ్యయ మంజూరి ప్రతిపాదనలతో పలు అనుబంధ అంశాలను సమావేశంలో చర్చనీయాంశాలుగా ప్రవేశపెట్టారు. క్యాంపాలో నిధుల నిల్వ, ఏపీవో 2024–25 రూపురేఖలు, కార్యకలాపాలు ఈ సమావేశంలో సమీక్షించారు. 2021–22, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో ఏపీఓకి సమగ్రంగా రూ.3230.32 కోట్లు వెచ్చించారు. దీనిలో రూ.3041.17 కోట్ల ఆర్థిక వ్యయాన్ని క్యాంపా జాతీయ అథారిటీ ఆమోదించింది. ఏపీఓ 2023 – 24 కింద గతేడాది డిసెంబర్ 31 నాటికి రూ. 644.53 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అనూగర్గ్, రెవెన్యూ, అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత్ సాహు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి విశాల్ కుమార్ దేవ్, పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సుశీల్ కుమార్ లోహాని, సమాచార, పౌర సంబంధాల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ సింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ చిత్రా అర్ముగం, పీసీసీఎఫ్ (వన్యప్రాణులు) సుశాంత్ నందా, క్యాంపా కమిటీ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

'హైటెక్' విషాదంపై విచారణ

భువనేశ్వర్: నగరంలో చోటుచేసుకున్న హైటెక్ ఆస్పత్రి విషాద ఘటనపై కార్మిక శాఖ కమిషనర్‌తో విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గతేడాది డిసెంబర్ 29న హైటెక్ ఆస్పత్రిలో ఏసీ పేలుడు సంఘటన సంభవించింది. ఈ విచారకర ఘటనలో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆస్పత్రి నిర్వహణపై సర్వత్రా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి వివరణాత్మక నివేదికను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ కమిషనర్‌ను కోరింది.

నిరసన ప్రదర్శనలతో చర్యలు

సోమ, మంగళవారాల్లో స్థానిక ఆరోగ్య శాఖ మంత్రి నిరంజన్ పూజారి అధికారిక నివాసం వద్ద వివిధ సంస్థలకు చెందిన నిరసనకారులు ప్రదర్శనలు నిర్వహించి గుడ్లు, టమాటాలు రువ్వి రాద్ధాంతం చేశారు. దీని తర్వాత ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. గతేడాది డిసెంబర్ 29 సాయంత్రం జరిగిన పేలుడులో గాయపడిన నలుగురు టెక్నీషియన్లలో ముగ్గురు మరణించిన తరువాత హైటెక్ ఆస్పత్రి యాజమాని తిరుపతి పాణిగ్రాహిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ కాలేజ్ – కమ్ – హాస్పిటల్ లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఒడిశా స్టూడెంట్స్ వాయిస్ (ఏఓఎస్‌వీ) విద్యార్థుల సంఘం బైక్ ర్యాలీ నిర్వహించింది. అదేవిధంగా ఆరోగ్య శాఖ మంత్రి నివాసం ఎదుట కాంగ్రెస్ విద్యార్థి విభాగం నిరసన చేపట్టి తీవ్ర గందరగోళం సృష్టించింది. ఆస్పత్రి అధికారులను రాష్ట్ర ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపిస్తూ ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు కూడా విమర్శలు గుప్పించాయి. ఈ ఘోర ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర విభాగం డిమాండ్ చేసింది. అయితే ఆస్పత్రి ఘటన నేపథ్యంలో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని తిరుపతి పాణిగ్రాహి తెలియజేశారు.

క్లుప్తంగా

చదువుతోనే భవిష్యత్‌కు సార్థకత

కంచిలి: చదువుతోనే విద్యార్థుల భవిష్యత్‌కు సార్థకత లభిస్తుందని డిప్యూటీ కలెక్టర్ ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలను ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్క్రీనింగ్ టెస్ట్ పేపర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ క్విజ్ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 65 జట్లు పాల్గొన్నారు. ఇక్కడ స్క్రీనింగ్ టెస్ట్‌లో ఎంపికైన పది జట్లకు, క్విజ్ పోటీలను మధ్యాహ్న భోజన కార్యక్రమం అనంతరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ పొందల ఢిల్లీరావు, ఉపాధ్యాయులు బాలక ప్రసాదరావు, బుడ్డెపు కామేష్ రెడ్డి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ లోళ్ల శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి క్విజ్ విజేతగా పూండి జట్టు, ద్వితీయ స్థానంలో కవిటి, తృతీయ స్థానంలో లింబుగాం జట్లు నిలిచాయని నిర్వాహకులు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జేఆర్ పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. మండలంలోని పైడిభీమవరంలో గల సాహు దాబా ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం రాత్రి 11.45 గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వయస్సు సుమారు 30-40 మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఆదిత్యుని సన్నిధిలో జీఎస్టీ జాయింట్ కమిషనర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ సుమతి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. తొలిసారిగా అరసవల్లి క్షేత్రాన్ని దర్శించుకున్న సందర్భంగా ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, మాధవ్ శర్మ, షణ్ముఖ శర్మ, ఫణీంద్ర శర్మలు ఆమెకు వివరించారు. వేదాశీర్వచనాన్ని అందజేసి ప్రత్యేక ప్రసాదాన్ని అందించారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం వార్షిక తనిఖీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయాన్ని ఎస్పీ జీఆర్ రాధిక శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయుధాలు భద్ర పరిచే గది, మోటార్ వెహికల్స్ విభాగాలు తనిఖీ చేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ విభాగాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఒత్తిడి లేకుండా పని చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

ఆదర్శనీయుడు స్వామీ వివేకానంద



జయపురం: మాట్లాడుతున్న మమతా హోత



బరంపురం: వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ తదితరులు

బరంపురం: నేటి యువతకు స్వామీ వివేకానందుడు ఆదర్శనీయుడని ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయిలు పేర్కొన్నారు. స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఐసీఆర్‌డీ, క్రాంతి సంస్థలతో పాటు వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో చైతన్య రథం ఊరేగిస్తూ ఆయన గొప్పదనం చాటారు. కార్యక్రమంలో బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, గంజాం బీజేడీ అధ్యక్షుడు చావ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జయపురం: స్థానిక అరవిందనగర్ సరస్వతీ శిశు మందిరంలో స్వామీ వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ కాంత మిశ్ర మాట్లాడుతూ.. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమిత మహాపాత్రో, సుజాత సాహు, ఎస్.సునీత, సంతోషిణీ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

మైత్రీ కంపెనీ అధికారులపై దాడి

- జీఎం, పీఆర్వోలకు తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో కంపెనీ పీఆర్వో దురువా

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో ఉన్నటువంటి మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధికారులపై శుక్రవారం దాడి జరిగింది. దాడిలో కంపెనీ జనరల్ మేనేజర్ సీహెచ్ బోసు (47), పీఆర్వో పృష్టి దురువా (46), డ్రైవర్ నవకుమార్ గౌడో(32)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో దురువా పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ దాడికి సంబంధించి కాసీపూర్ పోలీసుస్టేషన్‌లో కంపెనీ యజమాన్యం ఫిర్యాదు చేసింది.

మారణాయుధాలతో దాడి

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సమితిలోని కుచేయిపాదొరొ పంచాయతీ సిజిమాలిలో ఉన్నటువంటి బాక్సైట్ నిక్షేపాలు గల ప్రాంతానికి కంపెనీకి చెందిన దురువా, బోసులు ఒక బోలేరాలో వెళ్లారు. అనంతరం అక్కడ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా శంకర్, సొరం బాయి కూడలిలో సుమారు 20 బైకులపై 40 మంది వరకు వచ్చిన దుండగులు మారణాయుధాలతో వీరిపై దాడి చేశారు. ముందుగా బొలేరో వాహనం అద్దాలను పగులగొట్టి వెనుక సీట్లలో కూర్చున్న దురువా, బోసులపై మూకుమ్మడి దాడులు చేశారు. ఈ దాడుల్లో దురువా తలకు, ముఖానికి బలమైన గాయాలు తగలడంతో ఆయన అక్కడిక్కడే కుప్ప కూలిపోయాడు. బొలేరోలో ఉన్నవారికి తీవ్రగాయాలయ్యాయని నిర్ధారించుకున్న అనంతరం అక్కడ నుంచి దుండగులు పరారాయ్యారు. స్వల్ప గాయాలతో బయటపడిన బోసు జరిగిన విషయాన్ని కంపెనీ యజమాన్యానికి తెలియజేశారు. దీంతో సంఘటన ప్రాంతానికి చేరుకున్న కంపెనీ సిబ్బంది గాయాలతో పడిఉన్న వ్యక్తులను కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. స్వల్ప గాయాలు తగిలిన కంపెనీ జీఎం బోసు, డ్రైవర్ నవకుమార్ గౌడోలకు అక్కడే వైద్యం చేయగా, తీవ్రగాయాలకు గురైన దురువాను మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు.



దాడిలో అద్దాలు పగిలిన బొలేరో వాహనం

ముగ్గురు నిందితులు గుర్తింపు

కంపెనీ అధికారులపై దాడులు జరిపినవారిలో జోలే నాయక్, కార్తీక్ నాయక్, యజ్ఞ నాయక్‌లు ఉన్నట్లు బాధితులు తెలియజేశారు. ఈ మేరకు వారి పేర్లతో పాటు మరికొంత మందిపై పోలీసుస్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

జేకేపూర్‌లో ముగ్గుల పోటీలు

రాయగడ: సదరు సమితి జేకేపూర్‌లోని వేంకటేశ్వర స్వామి మందిర ప్రాంగణంలో సంక్రాంతి పురస్కరించుకొని దేవస్థానం వారు ముగ్గుల పోటీలను నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వారి సృజనాత్మకంగా వేసిన రంగవళ్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. పోటీలకు శశికళ, ప్రశాంతిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు సంక్రాంతి రోజు బహుమతులు అందజేస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పట్నాన గౌరి శంకర్ తెలియజేశారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

చక్కని దస్తూరి ఉండాల్సిందే

- వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- హైకోర్టు తీర్పు అమలుకు చర్యలు

భువనేశ్వర్: చికిత్స, వైద్యం, పంచనామా ఇతరేతర సందర్భాల్లో జారీ చేసే నివేదికలు, మందుల చీటీలు, ఆరోగ్య పరీక్షల నివేదికల్లో రాతలు స్పష్టంగా ఉండాల్సిందేనని, చక్కని దస్తూరి సాధ్యం కాకుంటే విడివిడిగా పెద్ద అక్షరాలు లేదా టైపు చేయాల్సి ఉంటుందని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పు వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా సేవలు అందిస్తున్న ప్రైవేటు, ప్రభుత్వ, ప్రభుత్వేతర వైద్య, ఆరోగ్య సంస్థలు, వైద్య బోధన ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సూచనలు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వైద్యులు అన్ని ప్రిస్క్రిప్షన్లు, పోస్ట్‌మార్టం నివేదికలు, ఇతర మెడికో, లీగల్ పత్రాల్లో స్పష్టమైన చేతిరాత, వీలైతే పెద్ద అక్షరాలతో లేదా టైప్ చేసి జారీ చేయాలని ఆరోగ్య శాఖను ఆదేశించింది. పాముకాటు మరణంలో ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడానికి సంబంధించిన కేసు విచారణ పురస్కరించుకుని చేపట్టిన విచారణలో జస్టిస్ ఎస్.కె.పాణిగ్రాహి ఏక సభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. కీలకమైన వైద్య సంబంధిత వ్యవహారాల్లో వైద్యుల రాతలు అర్థం చేసుకోవడంలో న్యాయాధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ ధర్మాసనం ఎత్తిచూపింది. మెడికో లీగల్ డాక్యుమెంట్లు దారుణంగా ఉన్నాయని, న్యాయవ్యవస్థ ఆ లేఖలను చదివి ఒక ఖచ్చితమైన నిర్ధారణకు రావడం చాలా కష్టంగా ఉందన్నారు.

బిజీ షెడ్యూల్ ఉన్నా సరే...

అయితే వైద్యుల బిజీ షెడ్యూల్‌ను కోర్టు అంగీకరించింది. అయినప్పటికీ వైద్యులు ఏదైనా సూచించేటప్పుడు వారి చేతిరాతపై శ్రద్ధ వహించాలని సూచించారు. రాష్ట్రంలో అత్యధిక శాతం వైద్యులు జిగ్‌జాగ్ రాతను రాస్తుండడంతో ఎవరికీ చదవడం సాధ్యం కావడం లేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వైద్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లు, మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు వారు మందులను సూచించేటప్పుడు సరైన చేతిరాత లేదా టైప్ చేసిన పత్రాల్ని జారీ చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్క్యులర్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని రిపోర్టులు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నేషనల్ మెడికల్ కమిషన్ (చాప్టర్ 2-4బి) ప్రకారం రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు, ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేస్తున్న ఆరోగ్య సేవా కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లు, మెడికల్ కాలేజీల మెడికల్ ఆఫీసర్లు ప్రిస్క్రిప్షన్ సరైన స్పష్టమైన చేతిరాతలో లేదా టైప్ చేసి జారీ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆయన కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదిక, స్టాల్స్, సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ ఎస్‌ఈని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా, పరిశ్రమలు, ఆస్తుల పంపకాల శాఖలు, తదితర శాఖలు ఏర్పాటు చేయాలని, స్టాల్స్ ఏర్పాటు చేసే శాఖలు డీఆర్‌డీఏ పీడీని సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రొటోకాల్ చూసుకుని ఆహ్వానాలు పంపాలని డీఆర్‌ఓలను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు.

19 నాటికి జాబితా అందించాలి..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగుల జాబితాను ఈ నెల 19వ తేదీలోగా ఫొటోలతో డీఆర్‌ఓకు అందజేయాలని సూచించారు. ఉద్యోగుల పేర్లతోపాటు వారు ఏ విధంగా ప్రశంసా పత్రానికి అర్హులో తెలియజేస్తూ వివరణ విధిగా తెలియజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ వేదిక ఏర్పాట్లలో ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా చూడాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందుగానే సిద్ధంగా ఉండాలని చెప్పారు. గణతంత్ర దినోత్సవం రోజున సరిపడే మాస్కులు అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తూ కోవిడ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరేడ్‌పై వివరించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, ఉప కలెక్టర్ పద్మావతి, డీపీఓ రవి కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రసాదరావు, ఏపీసీ జయ ప్రకాష్, డీఈఓ వెంకటేశ్వర్లు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఆర్డీఓ గంగాధర్, ఎల్డీఎం సూర్యకిరణ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతి శ్రీ, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, సీపీఓ లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

3079 ఆలయాల నిర్మాణం

కొత్తూరు: రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 3079 హిందూ దేవాలయాలను రూ. 843.76 కోట్లతో నిర్మిస్తున్న ట్లు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. రాష్ట్రంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా 2872 ఆలయాలను రూ.298.67 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు భాగస్వామ్య పద్ధతిలో ఫేజ్ 1, 2, 3లలో రాష్ట్రంలో 207 ఆలయాలను రూ. 544.89 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. కొత్తూరు మండలంలోని హంస కాలనీ, కొత్తగూడ గిరిజన గ్రామాల్లో నిర్మిస్తున్న శివాలయం, శ్రీకృష్ణదేవాయాల పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని శ్రీవాణి, సీజీఎఫ్ కేటగిరీల కింద మొత్తం 55 ఆలయాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో హిందూ సంప్రదాయాలను మరింత పెంపొందించేందుకు గాను దేవ దాయ శాఖ ద్వా రా ఆలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్మించే ఆలయాలకు 20 శాతం ప్రజలు, 80 శాతం దేవదాయ శాఖ చెల్లిస్తుందని తెలిపారు. గోదావరి జిల్లాలో అయితే 30-70 ఉంటుందన్నారు. ఆలయాల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, హంస శివాలయం కమిటీ సభ్యులు బి.వెంకటరావు, పొగిరి రవి, గోపాలరావు, మల్లేశ్వరరావు, అరసవిల్లి సూర్యనారాయణ ఆలయం ఈఓ సూర్యప్రకాష్, ఈఈ చలమల శెట్టి వెంకటరమణ, టీటీడీ నిర్మాణాల పనులు ఈఈ వీఎస్ కృష్ణ పాల్గొన్నారు. శుక్రవారం ఒక్క రోజే 30 ఆలయాలకు సంబంధించిన బిల్లులు చెల్లించినట్లు ఈఈ తెలిపారు.

జోడో న్యాయ యాత్ర రూటు మార్పు

- మయూర్‌భంజ్ మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశం
- ఏఐసీసీ కార్యదర్శి శరత్ రౌత్ వెల్లడి

భువనేశ్వర్: ఫిబ్రవరి నెలలో జరగనున్న భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. అయితే యాత్రకు లోగడ ప్రతిపాదించిన రూటు మారింది. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో 4 పగలు, 3 రాత్రులు ఉండనున్నారని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శి శరత్ రౌత్ తెలిపారు. లోగడ భారత్ జోడో న్యాయ్ యాత్ర సంబల్‌పూర్ గుండా రాష్ట్రంలోనికి ప్రవేశించేందుకు ప్రతిపాదించారు. తాజా ప్రతిపాదన ప్రకారం గిరిజన ప్రభావిత మయూర్‌భంజ్ గుండా రాష్ట్రంలో ప్రవేశించేందుకు రూట్ ప్లాన్‌లో మార్పు జరిగినట్లు శరత్‌రౌత్ వివరించారు. రాహుల్ గాంధీ జార్ఖండ్ నుంచిఒడిశాలోకి ప్రవేశించి మయూర్‌భంజ్,కెంజొహర్, సుందర్‌గఢ్ మరియు ఝార్సుగుడ జిల్లాలను సందర్శిస్తారు.

సవరించిన ప్లాన్ ప్రకారం...

కొత్త రూట్ ప్లాన్ ప్రకారం రాహుల్ గాంధీ మయూర్‌భంజ్ జిల్లాలోని కరంజియా మీదుగా ఒడిశాలోకి ప్రవేశిస్తారు. ఈ పర్యటనలో భాగంగా మరికొన్ని ప్రాంతాలు సందర్శించేందుకు వీలుగా రూట్‌లో మరిన్ని మార్పులు చేయాలని రాష్ట్ర నాయకులు అభ్యర్థించారు. వీరి అభ్యర్థన మేరకు తాజా మార్పు చేర్పులు ఉంటే ఒకటి, రెండు రోజుల్లో తెలియజేస్తామని శరత్ రౌత్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జరగనున్న పలు ఇతర కార్యక్రమాలకు సైతం రాహుల్ గాంధీ హాజరవుతారని రాష్ట్ర కాంగ్రెసు వర్గాల సమాచారం. రాష్ట్రంలో కోస్తా, దక్షిణ ప్రాంతాలను సందర్శిస్తారని వెల్లడించారు. భువనేశ్వర్‌లో భారీ ర్యాలీ నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించే అవకాశం ఉందన్నారు.

విజయవంతం చేయాలి

భారత్ జోడో న్యాయ్ యాత్రను ప్రోత్సహించేందుకు స్టిక్కర్ ప్రచారం ప్రారంభోత్సవానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. గత 23 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో లేకున్నా 2024 ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్ నాయకులు, కార్యకర్తలు ఉవ్విళూరుతున్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర కార్యకర్తల్లో నైతిక స్థైర్యాన్ని ప్రేరేపిస్తుందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2015 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 16 స్థానాల్లో గెలుపుతో కూడగట్టుకున్న బలం, 2019 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 9కి దిగజారింది. ఈ పరిస్థితిని చక్కదిద్దుకుని త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 90 స్థానాలు పైబడి కైవసం చేసుకోవాలనే ఆకాంక్షతో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) పలు విధాలా కృషి చేస్తుంది.

బాల్య వివాహాలు తగ్గుముఖం

- మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరావు తదితరులు

పర్లాకిమిడి: జిల్లాలోని ప్రతీ పంచాయతీలో అధికారుల ప్రచారం, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో 'మైనర్ బాలికల సంరక్షణ – తీసుకోవాల్సిన జాగ్రత్తల'పై జిల్లాస్థాయి సమావేశాన్ని ప్రేమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిదండ్రులు మంచి నడవడిక నేర్పించాలని సూచించారు. సమావేశంలో నువాగడ, గుమ్మా, రాయఘడ, మోహనా సమతిల నుంచి పంచాయతీరాజ్ ప్రతినిధులు పాల్గొని చైల్డ్‌కేర్‌పై తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రేమ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జాకబ్ తూండియాల్, ఇడ్కో కంపెనీకి చెందిన వాల్లబన్, కంధమాల్ ప్రేమ్ సంస్థ అధికారి సుధీర్ దిగాల్, గుమ్మా సమతి అధ్యక్షురాలు సునేమీ మండల్, ఎస్‌డీసీ చైర్మన్ మరియం రైయితో, సీసీడీ సంస్థ అధ్యక్షుడు అడ్డాల జగన్నాథరాజు, మహిళా మైక్రో సహకార సంస్థ డైరెక్టర్ ఎ.పద్మా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూరీలో భద్రత కట్టుదిట్టం

- ఐజీ ఆశిష్ సింగ్

భువనేశ్వర్: పూరీ పట్టణ వ్యాప్తంగా భద్రతా వ్యవస్థ కట్టుదిట్టం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఆశిష్ సింగ్ తెలిపారు. ఈనెల 17న పూరీ శ్రీమందిర్ వారసత్వ ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవం నేపథ్యంలో ఈ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమైన యజ్ఞం మొదలుకొని లోకార్పణ మహోత్సవం ముగిసేంత వరకు పట్టణవ్యాప్తంగా భద్రతా వ్యవస్థ నిరవధికంగా కొనసాగుతుందన్నారు. 44 ప్లాటూన్ల పోలీసు బలగాలతో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

5 అంచెల భద్రత వ్యవస్థ

పలువురు వీఐపీలు, లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి పూరీ పోలీసులు 5 అంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ కార్యాచరణ శుక్రవారం ప్రత్యేక యజ్ఞంతో ప్రారంభమైంది. ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పూరీ శ్రీమందిర్ వారసత్వ ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవంలో పాల్గొనే కార్యక్రమం ముగిసేంత వరకు భద్రత కొనసాగుతుంది. పూరీ పట్టణమంతటా 135 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 5 మంది అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హోదా అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో భద్రతా వ్యవస్థ పని చేస్తుంది. 10 మంది డిప్యూటీ సూపరింటెండెంట్లు మరియు 30 మంది ఇన్‌స్పెక్టర్లు కాకుండా శిక్షణ పొందిన పోలీసులు, జాగిలాల స్క్వాడ్‌లు, నిఘా బృందాలతో కూడిన బాంబు నిర్వీర్య బృందాన్ని శుక్రవారం నుంచి జనవరి 17న ఈవెంట్ ముగిసే వరకు అధికారులు భద్రతా ప్రయోజనాల కోసం నియమించారు. ప్రధాన కేంద్రాల్లో ఫేస్ రీడింగ్ పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం యజ్ఞాలు నిర్వహించే చోట ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. పూరీ శ్రీమందిరం ప్రాకార పథకం ప్రారంభోత్సవానికి సంబంధించిన వేడుకల సమయంలో కూడా భక్తులు యథాతథంగా శ్రీమందిరంలోకి ప్రవేశించి దర్శించుకునేందుకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఐజీ వివరించారు.

భక్తిశ్రద్ధలతో కుడారై వేడుకలు



స్వామివారికి సమర్పించిన పాయసం

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో ప్రధాన ఘట్టమైన కుడారై వేడుకలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. స్వామివారికి విశేష పూజలతో పాటు 108 గంగాళాల్లో 16 రకాల సుగంధ ద్రవ్యాలు వేసి చేసిన అర్కరసు (పాయసం) నివేదనగా సమర్పించారు. అనంతరం ఆ ప్రసాదాన్ని భక్తులు సేవించారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్

బరంపురం: పట్టణంలోని 42వ వార్డు గొయిలండిలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై శుక్రవారం మాక్‌డ్రిల్ చేపట్టారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఏవిధంగా తప్పించుకోవాలని, ఇతరులను ఎలా రక్షించాలని అనే విషయాలను ప్రాక్టికల్‌గా చేస్తూ చూపించారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా కార్యదర్శి సురేంద్ర మహరణ తదితరులు పాల్గొన్నారు.



వంటగ్యాస్ లీకైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

పటిష్టంగా లైంగిక వేధింపుల నిరోధక చట్టం

విజయనగరం అర్బన్: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డీఆర్ఓ ఎస్.డి.అనిత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతకుమారి, కె.విజయకుమారి, ఎస్.విద్య, పి.సాయిలక్ష్మి పాల్గొన్నారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వెండి మండపంలోని సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచి పూజలు చేశారు. అనంతరం సహస్రదీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, రామ గోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ విభాగానికి అదనపు గదుల ప్రారంభం




రిబ్బన్ కట్ చేసి నూతనగదులను ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో ఉన్న కమ్యూనికేషన్ విభాగానికి సంబంధించి నిర్మించిన అదనపు గదులను ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే మహిళా సిబ్బంది వేచి ఉండేందుకు, కమ్యూనికేషన్ విభాగం పరికరాలను ఉంచేందుకు స్టోర్‌రూమ్ అవసరమని తెలపడంతో, వాటిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కమ్యూనికేషన్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గదుల నిర్మాణానికి శ్రమదానం చేసిన పోలీస్ సిబ్బంది, హోంగార్డులను ప్రత్యేక అభినందించి, వారికి కొత్త బట్టలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రెయినీ ఐపీఎస్ మండ జావలి అల్ఫాన్స్, డీఎస్పీలు డి.విశ్వనాథ్, ఆర్.గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు, యూనివర్స్, సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ పాలక మండలి కాలపరిమితి పెంపు

విజయనగరం అర్బన్: డీసీసీబీ పాలక మండలి కాలపరిమితిని మరో ఆరునెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసిందని డీసీసీబీ సీఈఓ కె.జనార్దన తెలిపారు. ఈనెల 18వ తేదీతో ముగియనున్న పాలన కాలపరిమితి గడువును పెంచిందని, అంతవరకు ప్రస్తుతం ఉన్న ఏడుగురు సభ్యుల పాలక మండలి ఉంటుందని తెలిపారు.

ప్రకృతి సాగు మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా మేనేజర్ ఆనందరావు

విజయనగరం ఫోర్ట్: ప్రకృతి సాగు పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా మేనేజర్ ఎం. ఆనందరావు అన్నారు. శుక్రవారం స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో విజయనగరం డివిజన్‌కు చెందిన రైతులతో వ్యవసాయ సిబ్బంది ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 మార్చి నాటికి ఎంతమంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తారో యాక్షన్ ప్లాన్ వేయడం జరిగిందన్నారు. ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు.

700 సారా ప్యాకెట్ల స్వాధీనం

పాచిపెంట: ఇద్దరు వ్యక్తుల నుంచి 700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై ముసలయ్య తెలిపారు. మక్కువ మండలం ఎస్ పెద్దవలస గ్రామానికి చెందిన కలికోట చందు, వెలగడ జంపయ్యలు సారా తరలిస్తుండగా పట్టుబడ్డారని, వారి నుంచి 700 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ నాగలక్ష్మి



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



విద్యార్థిని నృత్య ప్రదర్శన

విజయనగరం అర్బన్: కుల మతాలకు అతీతంగా, అన్ని వర్గాల వారి హక్కులు, అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్ అందరివాడని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. చదువు, విజ్ఞానంతో వివక్షపై విజయం సాధించారన్నారు. సామాజిక సమతా సంకల్ప మహోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై సమాచారశాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఉద్యోగం కోసం ఉన్నత చదువులు చదవలేదని, విజ్ఞానార్జన కోసం, సమాజానికి తన చదువు ఉపయోగపడాలని చదివారని తెలిపారు. చదువే కాకుండా కుల, మత, రాజకీయ, ఆర్థిక అంశాలపై అనేక పుస్తకాలను రచించారని, విద్యార్థులు కొంత సమయాన్ని కేటాయించి ఆయన రచనలను చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో సేకరించిన సంతకాలతో కూడిన ఫ్లెక్సీలను అంబేడ్కర్ స్మృతి వనంలో డిస్‌ప్లే చేస్తారని తెలిపారు. దళిత నాయకుల అభ్యర్థన మేరకు కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అంబేడ్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని వెల్లడించారు. జేసీ కె.మయూర్‌అశోక్ మాట్లాడుతూ ఈ నెల 19న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ స్వరాజ్య మైదానంలోని 19 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించనుందన్నారు. అన్ని జిల్లాల్లో ఈ నెల 9 నుంచి 19 వరకు సచివాలయ పరిధిలో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సంక్రాంతి తర్వాత మానవ హారం, మారథాన్, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ గొప్పదనంపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపజేశాయి. అంబేడ్కర్‌పై గంటాన అప్పారావు, వేపాడకు చెందిన అంబేడ్కర్ కళాబృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో గిరిజన యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్, డీవీఎంసీ సభ్యులు జయరాజ్, భానుమూర్తి, శ్రీను, దళిత నాయకులు ఉదయ్ భాస్కర్, రామునాయుడు తదితరులు మాట్లాడారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, డీఐపీఆర్‌ఓ డీ.రమేష్, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, జీఎస్టీ నిర్మలాదేవీ తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని అందుకు గాను ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో కృషిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెయిన్ ఫారెస్టు అలయెన్స్ ఎగ్జిక్యూటింగ్ ఏజన్సీ వారితో సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ బయో డయవైర్సిటీ అక్రాస్ ల్యాండ్స్ ల్యాండ్‌స్కేప్స్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అడవులు, అక్రమణ, వ్యవసాయ క్షేత్రాల విస్తరణతో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడే విధంగా సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టాలని, అందుకు స్థానిక ప్రజలకు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. సమీకృత వ్యవసాయ విధానంతో సామాజిక ఆర్థికాభివృద్ధి కూడా సాధించే విధంగా ప్రణాళికలను రూపొందించాలని వ్యవసాయ అనుబంధ శాఖలకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం, రైతు సాధికార సంస్థ, స్థానిక పౌర సమాజ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రెయిన్ ఫారెస్టు అలయన్స్ లీడ్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ఇంటరేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అమలు చేసే ఏజెన్సీలన్నీ వారితో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు వివరాలను రెయిన్‌ఫారెస్టు అలయన్ సంస్థ కన్సల్టెంట్ కె. శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎం పి.షణ్ముఖరాజు, జిల్లా ఉద్యాన అధికారి కె.వరప్రసాద్, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 2112 టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్
- సారిపల్లి, సోనియానగర్‌లలో పర్యటన



టిడ్కో గృహ సముదాయాల్లో వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 1.50 లక్షల టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు చేసేలా చర్యలు చేపడుతున్నామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేదలకోసం సారిపల్లి, సోనియానగర్ ప్రాంతాల్లో నిర్మించిన గృహ సముదాయాలను సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి నెలాఖరులోగా సారిపల్లి ప్రాంతంలో నిర్మించిన 1024 ఇళ్లలో, సోనియానగర్‌లో నిర్మించిన 1088 ఇళ్లలో సంబంధిత లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహప్రవేశాలకు సంబంధించి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 95 వేల టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, ఫిబ్రవరినెల ప్రారంభ సమయానికి ప్రభుత్వం నిర్దేశించిన ఒక లక్షా యాభై వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం చేపడతామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు సుమారు రూ.10లక్షల విలువైన ఆస్తిని జగనన్న కానుకగా ఇవ్వడం దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేని మహోత్తర కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ జ్యోతి, డీఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త



లక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, (ఇన్‌సెట్లో) లక్ష్మి (ఫైల్)

గుర్ల: మద్యానికి బానిసయ్యావని, కుటుంబం ఆర్థికంగా నాశనం అవుతోందని మందలించిన భార్యను మద్యంమత్తులో ఉన్న భర్త కర్రతో కొట్టి హత్యకు పాల్పడ్డాడు. గుర్ల మండలంలోని కొండగండ్రేడులో గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై చీపురుపల్లి సీఐ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండగండ్రేడుకు చెందిన మునకాల సత్యం, లక్ష్మి(45) భార్యభర్తలు. సమారు 20 ఏళ్ల పాటు సుఖసంతోషాలతో జీవనం సాగించేవారు. అయితే గడిచిన ఐదేళ్లగా సత్యం మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు సంపాదించిన నగదు మొత్తం మద్యానికి ఖర్చు చేయడంతో పాటు గ్రామంలో సుమారు రూ.15 లక్షలు అప్పులు చేశాడు. మద్యం తాగి ఇంటికి వచ్చిన ప్రతిసారీ భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగేది. రోజులాగానే లక్ష్మి గురువారం సాయంత్రం వారి కళ్లం వద్ద ఆవుకు పాలు పితుకుతున్న సమయంలో తాగివచ్చిన భర్తతో వాగ్వాదానికి దిగింది. ఆ సమయంలో కోపోద్రిక్తుడైన సత్యం భార్య తలపై పెద్దకర్రతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న గుర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేంద్ర తెలిపారు. మృతిచెందిన లక్ష్మికి డిగ్రీ చదువుతున్న కొడుకు గణేష్, వివాహమైన కుమార్తె జ్యోతి ఉన్నారు. హత్యకు పాల్పడిన భర్త సత్యం పరారీలో ఉన్నాడు.

మృతుడి కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందజేత



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జూ అధికారులు

దత్తిరాజేరు: విశాఖ జూలో విధి నిర్వహణలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బి.నగేష్ ఎలుగుబంటి దాడిలో గత ఏడాది నవంబర్ 27న మృతిచెందడంతో ఆయన కుటుంబానికి రూ.10లక్షల చెక్కును క్యూరేటర్ సాలరియా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం జూకు మృతుడి కుటుంబసభ్యులను పిలిపించి మృతుడి తండ్రి తవుడుకు చెక్కుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నట్లు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, మృతుని కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై పాపారావు

బలిజిపేట: బలిజిపేట గ్రామానికి చెందిన జి.వెంకటరమణ(35) స్నానానికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందాడని ఎస్సై పాపారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ, స్నేహితుడు సాయిరాంలు ఉదయం గ్రామ సమీపంలో ఉన్న నైరేడు కోనేరుకు వెళ్లారు. సాయిరాం చెరువుగట్టుపై కూర్చుని ఉండగా వెంకటరమణ స్నానం నిమిత్తం చెరువులో దిగి ఒక్కసారిగా జారిపోయాడు. ఈత రాకపోవడం, లోతు ఎక్కువగా ఉండడంతో నీళ్లు తాగేశాడు. ఇంతలో గట్టుమీద ఉన్న సాయిరాం కేకలు వేయడంతో కొందరు వచ్చి వెంకటరమణను చెరువులో నుంచి బయటకు తీసి బలిజిపేట పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య ఆరుద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

చకచకా ధాన్యం బిల్లుల చెల్లింపు

- ఒక్కరోజులోనే రైతుల ఖాతాలకు రూ.351 కోట్లు జమ

విజయనగరం అర్బన్:

ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం, వెంట వెంటనే ధాన్యం డబ్బులు ఖాతాలకు జమ చేస్తుండడంతో రైతుల ఇంట సంక్రాంతి శోభ కనిపిస్తోంది. జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు శుక్రవారం ఒక్కరోజులోనే రూ.351 కోట్లు ధాన్యం బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. ఖరీఫ్ 2023–24 సీజన్‌కు జిల్లాలోని 484 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 65,206 మంది రైతుల నుంచి జిల్లా యంత్రాంగం కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన ధాన్యంకు రూ.464 కోట్ల బిల్లులు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేసింది. ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతులకు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించినట్లు జేసీ కె.మయూర్ అశోక్ తెలిపారు.

కూడార్లై ఉత్సవం



రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 గిన్నెలలో స్వామివారికి నైవేద్యం



టీటీడీ ఆవరణలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాల్లో కూడార్లై ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు పి.వి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. రింగురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి 108 గిన్నెలలో ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు.

– విజయనగరం టౌన్

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మైత్రీ మీడియా ఆధ్వర్యంలో రంగవల్లికల పోటీల నిర్వహించడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జీటీపీఎల్ మైత్రీమీడియా చానెల్, ఎస్ఆర్ షాపింగ్ మాల్ సంయుక్తంగా గురజాడ కళాభారతి వేదికగా రంగవల్లికల పోటీలను శుక్రవారం నిర్వహించాయి. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ, సభ్యులు ఉమాబాలాజీ, లక్ష్మీశ్రీనివాస్, మానస, విశాలి, లతలు జడ్జిలుగా వ్యవహరించారు. రంగోలీ పోటీల్లో మొదటి బహుమతిగా ఆర్.శారదకు బంగారు నెక్లెస్, ద్వితీయ విజేత సీతాకుమారికి బంగారు చెవిదిద్దులు, మూడో విజేత మణికి 43 ఇంచీల స్మార్ట్ టీవీలను అందజేశారు. ట్రెజర్ హంట్ కార్యక్రమంలో విజేతలైన అనూష, హైమావతి, చిన్నారావు, అనూష, సంధ్య, ఉమా మహేష్, లక్ష్మి, ఆదిలక్ష్మి, అరుణకుమారి, పార్వతీలకు వెట్ గ్రైండర్లు, ప్యూరిఫైర్స్, ఎయిర్ కూలర్, వాషింగ్ మెషీన్, కలర్ టీవీలను బహుమతులుగా అందజేశారు. విజేతలను పోటీల నిర్వాహకులు అవనాపు విక్రమ్, సీతారామరాజు, ముధునూరి నకుల్‌వర్మ అభినందించారు.

రెండేళ్ల ప్రయోగానికి గుర్తింపు

- జాతీయస్థాయి ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కంచరాం విద్యార్థులు



విద్యార్థులు, గైడ్ టీచర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం వసంతకుమార్



కాంతికి సంబంధించి ప్రయోగం చేస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: గైడ్ టీచర్ మార్గదర్శకత్వంలో రెండేళ్లుగా ప్రయోగాలు చేస్తున్న వారి కృషి ఫలించింది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్, స్టూడెంట్ సైన్స్ విలేజ్–వర్క్‌షాప్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఈ నెల 17 నుంచి 20 వరకు హర్యానా రాష్ట్రంలోని 'ట్రాన్స్‌లేషనల్ హెల్త్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న 'ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్'కు రాజాం మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు పెనుబోతుల సౌజన్య, పిల్లా శిరీష, పోతల చరణ్, బార్నాన దినేష్, పైల సత్యవతిలు ఎంపికయ్యారని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ తెలిపారు. జాతీయస్థాయి కార్యక్రమం అమృత్‌కాల్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ పబ్లిక్ అవుట్‌రీచ్ ప్రధానాంశంగా జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా స్టూడెంట్స్ సైన్స్ విలేజ్‌లో నూతన ఆవిష్కరణలు, శాస్త్రీయ అక్షరాస్యత, క్లిష్టమైన ఆలోచనలు అనే అంశాలపై జరగనున్న వర్క్‌షాపులో కంచరాం పాఠశాల విద్యార్థులంతా పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయిలో జరగనున్న కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీ, హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, సిబ్బంది అభినందించారు.

గత అనుభవాల దృష్ట్యా ఎంపిక..

విద్యార్థులు పాఠశాలలో గతంలో చేసిన ప్రయోగాల దృష్ట్యా ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) డైరెక్టర్ నేరుగా కంచరాం పాఠశాల విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపికచేశారు. విద్యార్థులు చేపట్టిన ప్రయోగాలు ఉన్నతాధికారులను ఆకట్టుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు పాఠశాలలను ఎంపిక చేశారు. జిల్లాలో రెండు పాఠశాలలకుగాను కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో కాంతికి సంబంధించి ప్రయోగాలు, సంప్రదాయ పద్ధతిలో చిరుధాన్యాల పాడితయారీని విద్యార్థులు ప్రయోగాల ద్వారా నిరూపించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు.

22న శ్రీరామ భక్తుల శోభాయాత్ర

- కరపత్రాలు ఆవిష్కరించిన ఈఓ కిశోర్‌కుమార్



శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈఓ కిశోర్ కుమార్ తదితరులు

నెల్లిమర్ల రూరల్:

అయోధ్యలో రామమందిర ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న శ్రీరామ భక్తులు శోభాయాత్ర నిర్వహించనున్నారు. రామభద్రపురంలో శోభాయాత్ర ప్రారంభమై గజపతినగరం, విజయనగరం మీదుగా రామతీర్థం దేవస్థానం వరకు సుమారు 600 మంది భక్తులతో శోభాయాత్ర జరగనుంది. ఈ సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఈఓ కిశోర్ కుమార్ శ్రీరామభక్తుల శోభాయాత్ర కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. శోభాయాత్ర నిర్వాహక కమిటీ ప్రతినిధి సత్యనారాయణ, రామతీర్థం సేవాపరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ..రామభద్రపురం మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన గురుస్వామి బర్ల రామారావు ఆధ్వర్యంలో 600 మంది భక్తులతో శోభాయాత్ర జరుగుతుందన్నారు.

విజయనగరంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు మీదుగా శోభాయాత్ర నిర్వహించి రామతీర్థం చేరుకుంటారని తెలిపారు. అనంతరం రామతీర్థం కల్యాణ వేదిక వద్ద భారీ అన్నసమారాధన జరిపిస్తామని, భక్తులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామతీర్థం ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీనివాసరావు, సత్యం, ధర్మ రక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, అర్చకులు సాయిరామాచార్యులు, మల్లికార్జున శర్మ, సిబ్బంది రామారావు, తులసి, ధవళ లక్ష్మణరావు పాల్గొన్నారు.